రెండు పర్సులుంటే వుండొచ్చు. కాని దేష్ బోర్డులో డబ్బు? చిక్కులూ, ముళ్ళూ చాలా వున్నాయనిపించింది సుబ్రమణ్యానికి.

"నేను ఏమీ అనను. కాని రెప్పొద్దున్న ఒకసారి స్టేషనుకి రండి" అన్నాడు సుబ్రహ్మణ్యం లేస్తూ.

"తప్పకుండా" అంటూ చిరునవ్వుతో సాగనంపాడు రామయ్య.

"దేరీజ్ నో పెర్ ఫెక్ట్ క్రైమ్" అనుకున్నాడు రామయ్య సుబ్రమణ్యం మోటారు సైకిలు స్టార్టు చేస్తూ వుంటే.

"బట్ వన్ క్రైమ్ కెన్ మేక్ ఎనదర్ పర్‌ఫెక్టు" అన్న ఆలోచన వచ్చినప్పుడు రామయ్య మొహం కలువలా విడింది.

❖ ❖ ❖

హిందీకి విరుద్ధంగా గూండాలు చేసే అలజడిని పూర్తిగా ప్రభుత్వం అణచివేసింది. చనిపోయిన సబిన్స్‌పెక్టరు గారి భార్యకి గవర్నమెంటు రూ. 10,000 లు విరాళం యిస్తామని ప్రకటించింది – ఆకాశవాణి వార్తలు.

ఆమె కుంకుమ ఖరీదు పదివేలు !?

**(విశాఖ విరసం, 65 1.4.1965)**

# డిటెక్టివ్ లెసన్ నెం.1

డిటెక్టివ్ అప్రెంటిస్ ప్రసాద్ నాలుగోసారి అద్దంలో చూసుకొని తన టెరిలిన్ టైముడి సరిచూసుకొన్నాడు. ఉదయం ఎనిమిద యింది. అతను ప్రఖ్యాత అపరాధ పరిశోధకుడు అవినాశ్ బాబు వద్ద నిన్ననే ఉద్యోగంలో ప్రవేశించేడు. అవినాశ్ బాబు కోరికపై అతనింట్లోకే బస మార్చేడు.

నిన్ననే చెప్పేడు అవినాశ్ బాబు మొదటిపాఠం 'కళ్ళు పెట్టి చూడు, చూసిందాన్ని బట్టి చూడనిది గ్రహించు' అని ఉదాహరణలు యీ ఉదయం చెప్తానన్నాడు అవినాశ్.

ప్రసాద్ టైముడితో రాజీపడి అవినాశ బాబు గదివేపు నడిచాడు, గది ఖాళీగా వుంది. అవినాశ్ బాబు లేబొరేటరీలో వుంటారని గ్రహించాడు ప్రసాద్! తరువాత లేబొరేటరీకి వెళ్ళి చప్పుడుకాకుండా తలుపు తెరిచాడు. పొడుగాటి లేబొరేటరీలో రెండో వేపు. అవినాశ్ బాబు ఏదో ప్రయోగంలో నిమగ్నుడయి వున్నాడు, అతని వీపు ద్వారం వేపున్నా "రావోయ్ రా ! కూర్చో" అని ఆయన ఆహ్వానించగానే తనరాక యెలా కనిపెట్టేశాడా అని ఆశ్చర్య పడుతూ ప్రసాద్ లోపలికి ప్రవేశించాడు.

ఆరడుగుల ఎత్తున్న డిటెక్టివ్, ప్రసాద్‌వేపు నడిచి వచ్చేడు. ఒక చేతిలో టెస్ట్‌ట్యూబ్ బుస కొడుతున్నది. రెండవ చేతిలోవున్న బీకరులో ఏదో ఎర్రటి ద్రవం వుంది.

"కూర్చోవోయ్ కూర్చో!" అంటూ ప్రసాద్‌ని వొక కుర్చీలో కూర్చోపెట్టి, టెస్టుట్యూబ్‌ని బీకర్ని బీరువాలో పెట్టి ప్రసాద్ ముందు టేబిల్ మీద వోరగా కూర్చొని ప్రసాద్ వేపు చూచి నవ్వాడు అతను.

"నీ రాక ఎలా కనిపెట్టేనా అనే కాదోయ్ ఆలోచిస్తున్నావ్?" అని ప్రశ్నించాడు.

"కరెక్టు సార్!" అన్నాడు ప్రసాద్.

"తలతిప్పకుండా వెనక్కి చూడ్డం నేర్చుకోవాలి"

"ఎలాసార్ !"

"ముందు అద్దం పెట్టుకుంటే సరి!"

"మీ ముందు అద్దం లేదే !"

"అద్దంలా పనిచేసే గాజు తలుపుల బీరువా వుందికదా!"

"ఓస్! ఇంతేనా అపరాధపరిశోధన?" అని అన బోయి మానేశేడు ప్రసాద్.

"నువ్వు షిప్ మార్కు చిన్న అగ్గిపెట్టెలు వాడుతున్నావు కదూ?" అని అవినాశ్ బాబు అంటే ప్రసాద్ ఆశ్చర్యానికి మేరలేకపోయింది.

"ఎలా కనిపెట్టేసేరు సార్?" అని అడక్కుండా ఉండ లేక పోయాడు ప్రసాద్.

"చాలా సుళువు. నీకు ఫేషన్లంటే యిష్టమని నీ టెరిలిన్ టై, షర్టూ నీ షర్టు, జేబులో ఉన్న 20 సిగరెట్ల ప్లేయర్స్ సిగరెట్టు పెట్టె చెప్తున్నాయి. షిప్ మార్కు చిన్న అగ్గిపెట్టెలు సిగరెట్లు కాల్చేవారికోసం ప్రత్యేకం తయారు చేస్తారు మామూలు అగిపెట్టెలకంటే ఖరీదుకూడా జాస్తి. అవి యీ ఊళ్ళో అమ్మడం మొదలు పెట్టి 15 రోజుల యింది. నీకంట అవి పడకుండా వుండి వుండవని అనుకున్నా."

నిశ్చయంగా అవినాశ్ బాబు అఖండ ప్రజ్ఞాశాలి అని గ్రహించాడు ప్రసాద్.

"దీన్నే డిటెక్షన్ అంటారు. అంటే ఒక విషయం చూసి రెండోది గ్రహించడం. నీ దగ్గరున్నది సిగరెట్టుపెట్టె. దాన్ని బట్టి నువ్వు యెలాటి వాడివో నీవు వాడు కొనే యితర వస్తువులు ఎలాటివై యుంటాయో గ్రహించ గలిగి వుండాలి డిటెక్టివ్. నీ గురించి కావలిస్తే యింకా చెప్పగలను. నీకో ప్రియురాలు వుంది. కొంచెం బీదదనే చెప్పాలి. నల్ల మనుష్యుల్లో జమ. అల్లికలూ, కుట్టూ అంటే ఆమెకు చాలాసరదా. ఆవిడ నీకు యిచ్చిన బహుమతుల్లో పువ్వులుకుట్టిన ఎర్రడ్రాయరు ఒక టుంది. దానిమీద యీ వేళ ఉదయం నువ్వే పొరపాటున కాఫీ పోసుకున్నావు" ఎఫెక్టుకోసం ఆగేడు అవినాశ్.

ప్రసాద్‌కు మూర్ఛొచ్చినంత పని అయింది. అవినాశ్ చెప్పిన దంతా అక్షరాలా నిజం. కాని ఎలా కనిపెట్టేసేడా అన్నదే ఆశ్చర్యం !

"సార్ ! మీరు ఎలా ... " అని ప్రసాద్ అడుగుతుంటే 'ఇలా చెప్పగలగడం ఏం కష్టంలేదు' అంటూ అవినాశు బాబు అడ్డొచ్చేడు. "డబ్బున్న ప్రియురాళ్ళు ఊలు స్వెట్లర్లూ పార్కర్ పెన్నులూ, స్మగుల్డ్ వాచీలు ప్రెజెంట్సిస్తారు. ఎర్రనూలు డ్రాయరు కానుకిచ్చిన నీ ప్రియురాలు ధనవంతురాలు కాదు. టేబిల్ క్లాత్‌లమీదా, డోర్ కర్టెన్లమీదా కుట్లుకుట్టడం రివాజే. కాని లోపల తొడుక్కునే డ్రాయరుమీద ఎంబ్రాయిడరీ సాధారణంగా చెయ్యరు. దానిమీద కూడా అందంగా పువ్వులు కాయలూ కుట్టిందంటే నీ ప్రియురాలికి ఎంబ్రాయిడరీ అంటే విపరీతమైన యిష్టమని తెలుస్తుంది. సాధారణంగా ఎర్రరంగుని నల్ల ఆడ వాళ్ళు కోరుకుంటారు.

ఆ రంగు తమకి సరిపడదని వారికి తెలుసు. ఆ రంగు బట్టలు వారికి కట్టుకునే అవకాశం లేకుండా పోతుంది. అంచేత వారు యితర్లకి బట్టలు యిచ్చే టప్పుడు ఆ రంగునే ఎన్నుకుం టారు" అని ఆగిపోయేడు. ప్రసాద్ మెదడులో సుళ్ళు తిరగడం మొదలుపెట్టేయి. అతనికి యింకా సందేహాలు న్నాయి. 'కాని ఆ డ్రాయరు ఎర్ర రంగుదనీ దానిమీద పువ్వులున్నాయని, దానిమీద కాఫీ వొలక బోసుకున్నాననీ ఎలా కనిపెట్టేరు సార్?" అని నీరసంగా ప్రశ్నించేడు.

"ఈ విషయాలు కనిపెట్టడం అన్నిటికంటె సులువు" అని నవ్వుతూ ఆగిపోయేడు అవినాశ్.

ప్రసాద్ ఆతృత ఎక్కువైంది "ఎలా-సార్ !"

"మహా సులువు... నువ్వు పేంటు తొడుక్కోవడం మరచి పోయేవు ప్రసాద్" అంటూ నవ్వసాగేడు ప్రఖ్యాత డిటెక్టివ్ అవినాశ్ బాబు.

లెసన్ నెంబరు 1 : డిటెక్టివ్ కాదల్చుకున్నవారు పేంటు తొడుక్కోవడం మరిచిపోకూడదు.

అంటే, యితరులు మరచిపోవచ్చని కాదు.

**(జ్యోతి మాసపత్రిక, 1.4.1965)**

# అదృష్ట హీనుడు

"పాపం' కావేశానికింటి పేర్లాంటిది. 'పాపం కావేశం' అంటారంతా కావేశం గురించి ఏం మాట్లాడాల్సొచ్చినా.

పాపం చేసే పుట్టేనని కావేశం నమ్మకం.

ఈ జన్మలో మరింక ఏం పాపం చెయ్యకూడదని అతని ఆదర్శం.

కావేశం అంటే చాలామందికి అభిమానం, అమాయకు డని. ఎంతమంది అభిమానించినా సుఖపళ్ళేనిజీవి అతను. అతను మనస్ఫూర్తిగా నవ్వి ముప్ఫయి యేళ్ళయింది. అతని వయసిప్పుడు ముప్ఫై ఒకటి.

బట్టతల పాగాతో, బూజుపట్టినట్టున్న గడ్డంతో, చిరిగిన లాంకోటుతో, పొగచూరిన గోడకు వేలాడుతున్న ఫోటోలో రెండో వరసలో నిల్చున్న వాళ్ళలో మూడో మనిషిగా మాత్రం కావే శానికి తన తండ్రని తెలుసు. 'నాన్నుంటే ఎలా వుండునో' కావేశం చాలాసార్లాలోచించాడు. 'అమ్మకి జుట్టుండును' అని తప్పిస్తే తనతండ్రి జీవించివుంటే కలిగే ఇతర మార్పులేవీ కావే శానికి తట్టలేదు.

కావేశం చిన్నప్పుడే చెప్పేశాడు ఆచారిమేష్టారు 'వీడికీ జన్మలో ఒక్క మేథ మెటిక్కూరాదు' అని, కావేశానికి లెక్కల్తో పాటు చాలారాలేదు. అతనికి బాగా వచ్చేది హిస్టరీ, ఓ మోస్త రుగా వచ్చేది హిందీ. బళ్లో అతన్ని చీవాట్లు పెట్టని మేష్టరు లేదు. ఆఖరికి డ్రాయింగు మేష్టరు కూడా కొట్టాడతన్ని ఓనాడు.

రెండంచీల మీద లేదనిపించాడు స్కూలు ఫైనలు తన యిరవై య్యొకటో యేట. పైకి చదివించడాని కతని తల్లికి శక్తి